క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న ట్రైనర్ పద్మనాభస్వామి

బోయినపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ పద్మనాభస్వామి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసంలో నైపుణ్యత పెంచుకోవాలని సూచించారు. 20 గంటల పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఎంఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తెరపాక సుధాకర్, నల్లగొండ అనీల్, గజ్జెల అశోక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందిస్తున్న దాతలు

కోనరావుపేట: మండలం మరిమడ్లలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి చిన్నమనేని చంద్రశేఖర్‌రావు, గోపాల్‌రావు సోదరులు రూ.25 వేల సాయాన్ని అందించినట్లు సర్పంచ్ మాట్ల అశోక్ తెలిపారు. కోల రాములు కుమారుడు వెంకటేశ్ రూ.50,116 అందించినట్లు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి దాతలు తమ సహకారాన్ని అందించాలని కోరారు.

పద్మశాలీ భవన్ ప్లాన్ ఓకే



నమూనా ప్లాన్ పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో నిర్మించనున్న పద్మశాలీ భవన్‌ను సకల వసతులతో నిర్మిస్తామని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈమేరకు భవనం నమూనా చిత్రాన్ని ఆయన సిరిసిల్ల పద్మశాలీ నేతలతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. భవనం నిర్మాణం విశేషాలను నేతలతో ముచ్చటించి పలు సూచనలు చేశారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, డాక్టర్ గాజుల బాలయ్య, మండల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సెస్‌కు సమస్యలు కోకొల్లలు

- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- కర్రలే స్తంభాలుగా..
- ప్రమాదాల నివారణకు చర్యలేవీ?
- పూర్తికాని మిడిల్ పోల్స్ పథకం
- సెస్ పరిధిలో పరిస్థితి అస్తవ్యస్తం



కర్రలే ఊతంగా విద్యుత్ లైను



ముస్తాబాద్‌లో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ముస్తాబాద్: గతమెంతో ఘన చరితగల సెస్ పరిధిలో ఇంకా విద్యుద్దీకరణ పనులు జరగాల్సి వుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. ఎంత ఆధునీకరించిన ఇంకా పనులు మిగిలే ఉన్నాయనడానికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు సాయంగా కర్రల ఏర్పాటు తార్కాణం. ముస్తాబాద్ మండలంలోని 22 గ్రామాల్లో విద్యుత్ లైన్లు పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్నాయి. అంతేకాదు ముస్తాబాద్, గూడెం, ఆవునూర్ తదితర గ్రామాల్లో ఇళ్లపై నుంచే తీగలు ఉండడం ఆందోళన కలిగించే విషయం.

గ్రామజ్యోతి ప్రతిపాదనలెక్కడ?

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గ్రామజ్యోతిలో పలు విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా వేలాడే విద్యుత్ తీగలతో రైతులు, గృహ వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను తొలగించేలా చర్యలు చేపట్టారు. ఇందుకు గాను మండలంలో 2 వేలకు పైగా మిడిల్ పోల్స్, మెటీరియల్‌కు ప్రతిపాదించారు. ఇదిలా ఉండగా, వినియోగదారులే స్తంభాలు రవాణా, మెటీరియల్ రవాణా చేసుకోవాలనే నిబంధనలతో ఇబ్బందులు తలెత్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

➡ ముస్తాబాద్‌లో దుబ్బాక రహదారిలో పలు ఇళ్ల మధ్య నుంచే కరెంట్ తీగలు కిందికి వేలాడుతున్నాయి.

➡ ముస్తాబాద్ పట్టణంలోని రెండో వార్డులో అనమేని రాజయ్య ఇంటి వద్ద నుంచి మానుక కొమురయ్య ఇంటి వరకు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి.

➡ ముస్తాబాద్‌లో పార్వతీ రాజు ఇంటిపై ప్రమాదకరంగా కరెంట్ తీగలు ఉన్నాయి. కంతుల యాదమ్మ వార్డు సభ్యురాలి ఇంటి వద్ద, శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, ఆరుట్ల మహేశ్ ఇంటి వద్ద కరెంట్ తీగలు వేలాడుతున్నాయి.

➡ పోతుగల్‌లో ఎస్సీ కాలనీలో మెయిన్ లైన్ ప్రమాదకరంగా ఉంది. వీరసముద్రం చెరువులో విద్యుత్ పోల్స్ వంగి ఉన్నాయి.

➡ గూడెంలోని బీసీ కాలనీలో, మెయిన్ రోడ్డులో మిడిల్ పోల్స్ లేక తీగలు వేలాడుతున్నాయి. స్కూల్ నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లేవైపు ప్రమాదకంగా ఉంది. యాభై పోల్స్ అవసరం ఉంది.

➡ గూడెంలో డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద వున్న ఐదుగురి ఇళ్లకు పోల్స్ లేక 60 మీటర్ల సర్వీస్ వైరుతో కనెక్షన్లు తీసుకున్నారు.

➡ బందనకల్ నుంచి బుగ్గరాజేశ్వర గుడి వద్ద, బ్రిడ్జి పక్కన తీగలు వేలాడుతున్నాయి. గడ్డివాములు, హార్వెస్టర్లు నడవడం లేదు. రాగుల బాబు ఇంటి వద్ద మూడు మిడిల్ పోల్స్ అవసరం ఉన్నాయి. మెరుగు పర్శరాములు పొలం వద్ద, రాగుల పర్శయ్య పొలం వద్ద, గడ్డం శ్రీనివాస్ పొలం వద్ద ప్రమాదకరంగా తీగలు వేలాడుతున్నాయి. 30 పోల్స్ మంజూరైన ఇప్పటి వరకు ఇక్కడ ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

➡ చిప్పలపల్లిలో గాడిచెర్ల దేవయ్య పొలం వద్ద కుంట మీద తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పారిపెల్లి నాంపెల్లి కుమ్మరి కుంట పొలం వద్ద కిందికి రైతులకు తగిలేలా వేలాడుతున్నాయి.

➡ ఆవునూర్‌లో బోయిని రాజయ్య, మొదటి వార్డులో పడిగే భద్రయ్య, చొల్ల చంద్రయ్య ఇంటి వద్ద తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొండాపూర్ దారిలో బురుగుకింది మల్లేశం ఇంటి వద్ద, బురిజికింద ఆనందం ఇంటి వద్ద ప్రమాదకరంగా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీలో అత్యవసరం ఉన్నాయి. 60 పోల్స్ అవసరం ఉన్నాయి. దేవుని పోలం వద్ద వేలాడే తీగలు ఉన్నాయి.

➡ నామాపూర్, కొండాపూర్ గ్రామాల్లో పలు చోట్ల మిడిల్ పోల్స్ అవసరం ఉన్నాయి.

➡ ముస్తాబాద్, సేవాలాల్ తండాతో పాటు ఇతర విద్యుత్ లైన్లకు కర్రలను అమర్చారు.

విద్యుత్ తీగలు సరిచేయాలి



ముస్తాబాద్‌లో ఇండ్ల పై నుంచే విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దుబ్బాక దారిలో చేతులకు అందే విధంగా లైన్లు వేశారు. మిడిల్‌పోల్స్ ఎక్కడ వేస్తున్నారో తెలియడం లేదు. ప్రమాదాలు జరగక ముందే సరిచేయాలి. గ్రామజ్యోతిలో ప్రతిపాదనలకు మంజూరు ఇవ్వాలి.

– ఎదునూరి గోపికృష్ణ, ముస్తాబాద్

ఇబ్బంది పడుతున్నరు



పొలాల వద్ద వేలాడే విద్యుత్ తీగలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్లు, గడ్డివాములు, హార్వెస్టర్లు సరిగా పొలాల్లోకి వెళ్లలేకపోతున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయి. మూగజీవాలు కూడా మృతి చెందాయి. పొలాల వద్ద వేలాడే తీగలను సరిచేసి రైతుల ఇబ్బందిని తొలగించాలి.

– యెల్ల బాల్‌రెడ్డి, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపాం



మండలంలో ఇప్పటి వరకు 300కు పైగా మిడిల్స్ పోల్స్ వేశాం. మరో ఐదు వందల మిడిల్ పోల్స్‌కు ప్రతిపాదనలు పంపాం. సాధ్యమైనంత వరకు ఈ సమస్య పూర్తిగా పరిష్కరించేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు. అత్యవసరం ఉన్న ప్రాంతాల్లో అవసరం మేరకు మెటీరియల్, పోల్స్ అందిస్తున్నాం.

– మహేశ్, ఏఈ

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ప్రకటించారు. భగవంతరావునగర్, చెక్కపల్లి రోడ్డు, శ్యామకుంట, పోలీస్‌స్టేషన్ రోడ్డు, కాలేజీ రోడ్డు, భీమేశ్వరాలయం వీధి, పార్వతీపురం, మేయిన్ రోడ్డు, బద్దిపోచమ్మ, లక్ష్మీపూర్, బాలానగర్, లాలపల్లి, కట్ట కింద బస్టాండ్, గోశాల ఏరియా, జాత్రా గ్రౌండ్, రామమందిరం వీధి, వాసవీనగర్, న్యూఅర్బన్ కాలనీ, రాజీవ్‌నగర్, అంజనీనగర్, సాయినగర్, విద్యానగర్, మల్లారం రోడ్డు, మార్కండేయనగర్, పాపన్నచౌక్, హన్మక్కపల్లి, జయవరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

సెస్ గ్రామ ప్రతినిధులు

వేములవాడరూరల్: మండలంలోని నాగాయపల్లి గ్రామంలో సెస్ గ్రామ ప్రతినిధులుగా గోపు తిరుపతి, సాగర్ల నరేశ్‌ను ఎన్నుకున్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామం సెస్ గ్రామ ప్రతినిధులుగా పలుమారి రూప, బడుగు చందన ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కోనరావుపేట: మండలం మల్కపేట గ్రామ సెస్ ప్రతినిధులుగా కుంట వెంకన్న, ఎక్కల్‌దేవి పుట్టయ్య ఎన్నికైనట్లు సర్పంచ్ ఆరె లత తెలిపారు. నిజామాబాద్‌లో సెస్ ప్రతినిధులుగా నోముల భాస్కర్‌రెడ్డి, గుండ తిరుపతిగౌడ్ ఎన్నికయ్యారు.

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సెస్ ప్రతినిధులుగా బండి శ్రావణ్, సంపునూరి దశరథంను ఎన్నుకున్నారు.

సంక్షిప్తంగా..

విద్యార్థినులకు కరాటే శిక్షణ

కోనరావుపేట: మండలంలోని సుద్దాల, ధర్మారం, నిమ్మపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ బాలికల స్వీయ రక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్ట్రక్టర్ మంగళగిరి శ్రీనివాస్ తెలిపారు.

బీసీటీఏ డైరీ ఆవిష్కరణ

సిరిసిల్లఎడ్యుకేషన్: బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ డైరీని మంగళవారం డీఈవో డాక్టర్ ధనాల కోట రాధాకిషన్ ఆవిష్కరించారు.

బందనకల్ మాజీ సర్పంచ్ మృతి



ముస్తాబాద్: మండలంలోని బందనకల్ మాజీ సర్పంచ్ జంగం శివానందం(56) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేసిన ఆయన నాలుగు నెలల క్రితం అనారోగ్యానికి గురికాగా, సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస వేదిలారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

వేములవాడఅర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాజన్న ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను వేములవాడ ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ రవి మంగళవారం ప్రారంభించారు.

నీటి కొరత ప్రాంతాలను గుర్తించాలి

రుద్రంగి: వేసవికాలం సమీపిస్తున్నందున మండలంలో తాగునీటి కొరత ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం పల్లె ప్రగతి, ఈజీఎస్ పనులపై సమీక్షించారు.

బీరయ్య కామరాతి కల్యాణోత్సవాలు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో జరుగుతున్న బీరయ్య కామరాతి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం జోగు ఎత్తే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణయాదవ సంఘం బాధ్యులు వీరవేణి దేవేందర్, తిరుపతియాదవ్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో చౌడు భూముల్లో సాగుచేస్తున్న వరి పంటలను మండల వ్యవసాయాధికారి వెంకటేశ్ మంగళవారం పరిశీలించారు. వరి జింక్ లోపంతో ఎర్రబారడం, కాంప్లెక్స్ ఎరువులను అధికంగా వాడడం వల్ల వరిపంట దెబ్బతింటుందని గుర్తించామన్నారు. దీని నివారణకు చీమ పగుళ్లు వచ్చే వరకు ఆరబెట్టాలన్నారు. అలాగే ఎకరానికి ఐదువందల గ్రాముల జింక్ సల్ఫేట్ పోడి, లేదా జింక్ సల్ఫేట్ 2 గ్రాముల నీటిని కలిపి వరిపై పిచికారీ చేయాలన్నారు.

నార్మల్ డెలివరీతో ప్రయోజనాలెన్నో

- ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మహేశ్‌రావు

వేములవాడఅర్బన్: సుఖప్రసవాలతో మహిళలు ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు అన్నారు. మంగళవారం వేములవాడ ఏరియా ఆసుపత్రిలో నార్మల్ డెలివరీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్యులు ఇచ్చే సూచనలు సలహాలతో వ్యాయామం చేయాలన్నారు. మొదటి కాన్పు అయ్యేవారు సుఖప్రసవానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏరియా ఆసుపత్రిలో మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డకు జన్మనిస్తే ఉయ్యాలను బహుమతిగా అందిస్తామన్నారు. సమావేశంలో డాక్టర్ చైతన్య సుధ, డాక్టర్ దీప్తి, డాక్టర్ సింధు, డాక్టర్ జ్యోతి, హెడ్‌నర్స్ స్టెల్లా, స్టాఫ్‌నర్స్ భాగ్యలక్ష్మి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



కప్ అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల స్థాయి క్రీడోత్సవాల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మంగళవారం బహుమతులు అందచేసి మాట్లాడారు. క్రీడాభివృద్ధికి గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

మండలంలోని తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, వరదవెల్లి గ్రామాల్లో రూ.40 లక్షల ఈజీఎస్ నిధులు, వరదవెల్లిలో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.4.60 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు చిందం రమేశ్, గుంటి లతశ్రీ, ఆరెపల్లి లత, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, వైస్‌ఎంపీపీ నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, హైస్కూల్ డీడీ సీహెచ్ సంపత్‌రావు, పీఈటీ బోయిని సంతోష్ పాల్గొన్నారు.

సంత.. చింత

- ఆదివారం ఆగమాగం
- రోడ్డు మీదనే అమ్మకాలు
- ప్రమాదాలకు నెలవుగా సంత
- ప్రత్యేక స్థలం కోసం డిమాండ్
- 42 ఏళ్లుగా నిరీక్షణ



వీర్నపల్లిలో రద్దీగా ఉన్న సంత

వీర్నపల్లి: మండల కేంద్రంగా ఏర్పడిన తరువాత సకల సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన నేతలు మాటలు కోటలు దాటినా, వీర్నపల్లి అభివృద్ధి మాత్రం ఒక్క అడుగు ముందుకు పడ లేదు. 42 ఏళ్ల క్రితం సంత ఎలా ఉందో, ఇప్పటికే అలాగే ఉంది. రోడ్డుకిరువైపుల కూర్చోని వారసంతను నిర్వహించుకునే దుస్థితి ఉంది. అప్పటి ఎంపీ ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ దత్తత గ్రామమైన వీర్నపల్లిలో నేటికి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ నియోజకవర్గంలో ఒకటైన ఈ మండల కేంద్రంలో ఓ రైతు బజారు ప్రత్యేక స్థలం కేటాయించకపోవడం విమర్శలకు దారితీస్తుంది. పెరుగుతున్న జనాభా బట్టి ఇక సంతకు ప్రత్యేక స్థలం ఇవ్వాలని ప్రజల నుంచి అధిక డిమాండ్ ఉంది.

చుట్టుపక్కల గ్రామాల్లోనూ..

42 ఏళ్ల నుంచి ప్రతి ఆదివారం నిర్వహిస్తూ వస్తున్న ఈ సంతలో సమస్యలు మాత్రం తీరడం లేదు. సంతలో కనీస సౌకర్యాలు లేక ఇతర గ్రామల నుంచి కూరగాయలు అమ్మేందుకు వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. అలాగే పొద్దంత వ్యవసాయ పనులు చేసుకోని సాయంత్రం సమయంలో కూరగాయలు ఇతర వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు సంతకు వచ్చే వారికి కూడా ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో నిర్వహించే సంతకు దగ్గరలో ఉన్న గ్రామలు, తండాలు మద్దిమల్ల, కంచర్ల, రంగంపేట, అడవిపదిర, ఎర్రగడ్డ తండా, బంజేరు, భూక్య తండా, మద్దిమల్ల తండాల నుంచి పెద్ద ఎత్తున సుమారు ఐదు వందల మందికి పైగా వచ్చి వివిధ రకాల సామగ్రిని కొనుగోలు చేస్తారు.

మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు

గ్రామాల నుంచి వచ్చిన వారికి కనీసంగా మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం లేదు. స్థలం లేక రోడ్డుకు ఇరువైపుల కూరగాయలు, ఇతర సామాగ్రి పెట్టుకుని కూర్చునే విధానం చూస్తే అడుగు తీసి అడుగు వేయాలని పరిస్థితి ఉంటుంది. రానున్న వేసవికాలంలోపు సంతకు స్థలం కేటాయించి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యానికి మూల్యం తప్పదేమో.?

ఏళ్లుగా నిర్వహిస్తున్న సంతకు వచ్చిన వారికి అడపదడపా ప్రమాదాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న రద్దీతో పాటు రోడ్డుకిరువైపుల అమ్మకాల వల్ల ప్రతీ ఆదివారం కిక్కిరిసిపోతుంది. ఈ సమయంలో ఏదేని వాహనం వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మిగతా గ్రామాల్లోనూ ఇదే తీరు..

వీర్నపల్లి మేజర్ గ్రామపంచాయతీతో పాటు గర్జన్‌పల్లిలో నిర్వహిస్తున్న వార సంతలకు ఇప్పటికైన ప్రత్యేకమైన స్థలాలు ఎంపిక చేయలని ప్రజలు కోరుతున్నారు. రద్దీలో జేబు దొంగలు వారి చేతివాటం చూపుతున్నారని, ఎవరిని ఏమి అనలేని స్థితి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవస్థలు పడుతున్నాం



సంతలో కూర్చోవడానికి స్థలం లేక రోడ్డు పక్కనే కూర్చొని అమ్ముతున్నం. వాహనాల రాకపోకలు భయమవుతోంది. తాగేందుకు నీళ్లు లేక, హోటల్స్‌లో కొనుక్కుని తాగాల్సిన పరిస్థితి ఉంది. మూత్రశాలలు లేవు. స్థలం కోసం అడిగినా ప్రయోజనం లేదు.

– బట్టు మహిత, వీర్నపల్లి

ఓపిక పట్టాలి



వీర్నపల్లి, గర్జన్‌పల్లి గ్రామాల సంతల్లో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. సంతల స్థలాల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం.మండల ప్రజలు సంతల కోసం స్థలం దొరికేంతవరకు ఓపిక పట్టాల్సిందే. మండల ప్రజలు సహకరించాలి.

– నరేశ్‌కుమార్, ఎంపీడీవో, వీర్నపల్లి

కంటి వైద్య సేవలు విజయవంతం



శస్త్రచికిత్స పొందిన వారితో వైద్య బృందం

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో కంటి వైద్య సేవలు విజయవంతమయ్యాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్‌రావు అన్నారు. కంటి పొరతో బాధపడే వారికి ఆసుపత్రిలో వైద్యుల సూచన మేరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. మొత్తం ఎనిమిది మందికి కంటి పొరను తొలగించి లెన్స్‌ను అమర్చినట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్, కంటి వైద్య చికిత్స నిపుణులు ఖాదర్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ వెంకటరమణారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో మీర్జా, సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ బాలగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: స్థానిక వెంకంపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజుం నాయకులు వెంకటేశ్, అశోక్, నర్సయ్య, మల్లేశం పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని రంగంపేట గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం సర్పంచ్ నందగిరి లింగం ప్రారంభించారు.

చేసిన పనులకు బిల్లులు రావడం లేదు

- మండల సభలో సభ్యుల మొర



మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

గంభీరావుపేట: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని మంగళవారం ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మొరపెట్టుకున్నారు. ఎంపీపీ పిల్లి రేణుక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల మృతి చెందిన పోతిరెడ్డిపల్లె సర్పంచ్ బాలయ్య మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణకు వస్తున్న అధికారులు తమకు సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను పర్యవేక్షించాలని కో రారు. మండల వనరుల కేంద్రం ఆవరణలో ఎంఈవో మంకు రాజయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాల ని తీర్మానించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, పాల్గొన్నారు.

ముగిసిన సిద్దోగం

తంగళ్లపల్లి: గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి సిద్దోగం మంగళవారం వైభవంగా నిర్వహించారు. చివరి రోజు తిరుగువారం, ప్రత్యేక పూజలనంతరం అమ్మవారి ప్రసాదాలను భక్తులకు పంచారు. ఎంపీపీ మానస, సర్పంచ్ అనిత, ఉపసర్పంచ్ తిరుపతి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com